


"కాయా? పండా!"

గుమ్మంలో చంద్రశేఖర్ కనిపిస్తూనే ఆత్రంగా లేస్తూ ప్రశ్నించాడు రఘురాం.

"మొదటిదే." చంద్రశేఖర్ లోనికి వచ్చి నిరుత్సాహంగా కుర్చీలో ఆశీనుడయ్యాడు. చాలా సేపటి వరకూ ఏదీ మాట్లాడలేదిద్దరూ. బరువుగా దొర్లి పోయాయి కొన్ని క్షణాలు.

"ఆసలేమన్నారు!" చివరికి అడిగాడు రఘురాం." అమ్మాయి ఫొటో చూడలేదా? చూచి నచ్చలేదన్నాడా?"

"చూచాడు!" అబ్బాయి ఏమన్నాడో చెప్పడానికి కొంచెం తటపటాయించాడు చంద్రశేఖర్. 'ఇలాంటి పిల్లను చూడడానికి రమ్మంటున్నావురా నన్ను! ఇలాంటి జిడ్డు మొహాన్ని చేసుకోగలిగితే ఇప్పటికి నలుగురు పిల్లలుండే వాళ్ళు నాకు మల్లే! అవి ఈసడించాడా నలకూబరుడు!"

"మరి తల్లి దండ్రులు?"

"అబ్బాయికి నచ్చితేకదా పెళ్ళి మాటలు? అన్నారు వాళ్ళు. అంతకంటే ఏమంటారు వాళ్ళు? అయినా ఎనిమిది పదివేలకు తగ్గని ఆశలో ఉన్నారు వాళ్లు!"

"ఓ!" బరువుగా మూలిగాడు రఘురాం.

ప్రక్కగదిలో గోడకు ఆనుకొని నిల్చున్న కల్పన అంతా వింటూన్నది వీళ్ళ సంభాషణ పెళ్ళి కొడుకు తనని జిడ్డుమొహం అన్నాడని వినేప్పటికి అవమానంతో హృదయం విలవిల లాడింది. 'అయినా ఇప్పుడేదో కొంపమునిగినట్టు ఇంత గట్టిగా ఈ పెళ్ళి ప్రయత్నాలేమిటి? అన్నయ్యకు ఏదొచ్చినా ఆపుకోలేడు.'- కల్పన విసుగు అన్నగారి మీదికి మళ్లింది నిజంగా. ఈ పెళ్లి ప్రసంగం నెలక్రితం వరకూ మాటల మధ్య పొరపాటునకూడా దొర్లేది కాదు. పద్దెనిమిదేళ్ళయినా నిండని కల్పన పి. యు. సి. పరీక్ష వ్రాసింది మొన్నే. అమ్మాయి చదువులో ఫస్ట్ వస్తూందికదా, అయినా ఇప్పుడేం వయసు ముదిరిపోలేదుకదా అన్న ఉద్దేశ్యంతో పెళ్ళి తొందర పెట్టకోలేదు రఘురాం. చెల్లెలు డిగ్రీ తీసుకొన్న తరువాత అప్పుడు చూద్దాం అనుకొన్నాడు గాని. పదిహేను ఇరవై రోజుల క్రితం అతడి తప్పు తెలిపి వచ్చింది!

రఘురాం భార్య సౌభాగ్యలక్ష్మి. ఆమెకూ ఎదురింటి లలితమ్మకూ చిన్న కలహం జరిగింది. సౌభాగ్యను దెబ్బతీసే బాణాలతో అసందర్భంగా కల్పన పెళ్లి విషయం ఎత్తి విసిరింది సూటిగా సౌభాగ్య హృదయానికి గుచ్చుకొనేలా లలితమ్మ. "ఆఁ! నిన్ను చూచే నేర్చుకోవాలి! ఇంట్లో గుర్రంలా ఎదిగి కూర్చొంది ఆడపడుచు! దాని పెళ్లి చింతేమైనా పట్టిందీ మీకు? ఆ ఇంట్లో ఎదిగిన పిల్లను పెట్టుకొని నువ్వూ నీ మొగుడూ కులికితే సరి పోయిందీ? ఆఁ! దానికింక పెళ్ళా పెటాకులా? అబ్బ జతకు అమ్మ పోయినప్పుడే దాని సుఖం చూచేవాళ్లు పోయారు!"

సౌభాగ్య కళ్లొత్తుకొంటూ ఆ సంగతి భర్తతో చెప్పింది. విభ్రాంతుడయ్యాడు రఘురాం, అసలు కలహ కారణాలు ఎక్కడ పోయాయోగాని ఆ మాటే దంపతుల మానసంలో నిలిచి పోయి కలత పెట్టసాగింది.

రఘురాం బి. ఎస్‌సి. లో ఉండగా తండ్రి పోయాడు అతడు బి. ఎస్ సి. ఫస్టియర్‌లో ఉండగానే సౌభాగ్య సంబంధం వచ్చింది. తనకు కట్నకానుక లక్కరలేదని ఎమ్. ఎస్ సి. పూర్తి చేసే వరకు సహాయపడితే చాలునని-కట్నం లేకుండానే సౌభాగ్యను వివాహం చేసుకొన్నాడు రఘురాం. మాట ప్రకారం అత్తగారు వాళ్లు అతడు చదువు పూర్తి చేసేవరకు ఆర్థికంగా సహాయం చేశారు కూడా.

ఆరోగ్యంగా తిరుగుతూన్న తల్లి అనుకోకుండా రెండేళ్ళ నాడు గుండె ఆగి చని పోయింది. నాటి నుండీ కల్పనకు అన్నయ్యేకాక తల్లీ తండ్రీ కూడా రఘురామే, అయ్యాడు. ఆతడి భార్య కూడా ఆడబిడ్డను తోబుట్టువులా చూచుకొందే గాని ఎన్నడూ పన్నెత్తుమాట అని ఎరుగదు! నిష్కారణంగా నిందవచ్చి మీద పడడంతో గోదావరి వరదలా ఒక్కసారి

మొదలయ్యాయి కల్పన పెళ్ళి ప్రయత్నాలు అప్పటికి రెండు సంబంధాలు రావడమూ, చూడడమూ కట్న కానుకల దగ్గర తప్పి పోవడమూ జరిగింది. ఇప్పుడు చంద్ర శేఖర్ మాట్లాడుతున్న సంబంధం మూడ వది.

చంద్రశేఖర్ రఘురాం మంచి స్నేహితులు. మాటల సందర్భంలో "కల్పనకు మంచి సంబంధమేదైనా ఉంటే చూడరా!" అన్నాడు రఘురాం.

చంద్రశేఖర్ మనసులో రవీంద్ర మెదిలాడు చటుక్కున. వ గ్గురు ఆడ పిల్లల మధ్య తల్లి దండ్రులకు ఒక్కడే కొడుకు. కాస్తగాని ఉన్న తలో చిక్కగా ఉన్నారు. సంప్రదాయ మైన కుటుంబం. ఇదే ఊరు కూడా. రవీంద్ర చంద్రశేఖర్‌కు స్నేహితుడూ క్లాస్ మేటూ కూడా.

వరుడి వివరాలు చెప్పి కల్పన ఫొటో ఇప్పించుకొన్నాడు చంద్రశేఖర్. వాడికి ఫోటో చూపి, నచ్చితే పిల్లన చూడడానికి తీసుకు వస్తానని. దాని రిజల్టేయిలా తేలింది!

మ్లానంగా అన్నాడు రఘురాం! "పోనీలే సౌభాగ్య పెదనాన్న పిల్లెవరో ఉన్నా రట, అక్కడ ప్రయత్నించి చూద్దాం."!

"నాకెందుకో ఈ సంబంధం పోని వ్వాలనిపించడం లేదు, రఘు!"

"అరే! అతడికి పిల్లే నచ్చకపోతే యింకేం చేస్తావు?"

"అదే. వాడికంటి పొరలు కోసే ప్లానే వేస్తున్నాను."

"ఏం ప్లానబ్బా?"

అతడికి జవాబివ్వకుండా "కల్పనా. కొంచెం యిలారా అమ్మా!" అంటూ కేకేశాడు చంద్రశేఖర్.

మౌనంగా నడిచివచ్చి గడప దగ్గిరే ద్వార బంధం ఆనుకొని నిలబడింది కల్పన. ఆమెను ఎగాదిగా రెండు క్షణాల పాటు పరీక్షగా చూచాడు రఘురాం. 'పర్వా లేదు. కొంచెం వన్నెలు పెడితే దివ్యంగా వెలిగిపోగలదు!' అనుకొన్నాడు సంతృ ప్తిగా. రామన చాయన కనుముక్కు తీరు ఆకర్షణీయంగానే ఉంటుందిఆ అమ్మాయి. ఏమంటే ఈ కాలపు షోకూ విరగ బాట్లకు దూరంగా ఉండి సహజంగా కపిపిస్తూంటుంది. పోతే, ఆ పిల్ల ముఖం ఫోటో జనిక్‌గా ఉండదేమో! యింట్లో తీసిన ఫోటో కాబట్టి-నిజంగా కూడా ఆ అమ్మాయి ముఖం జిడ్డుగానే పడింది. పుట్టు అందం లేనిది పెట్టు అలంకారంతో వస్తుందా అంటారుగాని ఈ కాలంలో ఆడపిల్లలు పెట్టు అలంకారంలోనే వెలిగి పోతున్నారు. కాలానుగుణంగా మారక పోతే-యిదో-యిలాగే జిడ్డు మొహం అంటారు!

"అమ్మాయ్! ఒక మాట చెబుతాను. వింటావా?"

"... ...." ప్రశ్నార్ధకంగా చూచింది కల్పన.

"నువ్వే జిడ్డు మొహానివని తెలియ కుండా రవిని యిక్కడికి తీసుకు వస్తాను రేపు. నువ్వు కొంచెం ఫాషన్‌బుల్‌గా తయారవ్వాలి. అతడితో సోషల్‌గా మాట్లాడగలగాలి. ఎలాగైనా అతడిని ఆకట్టుకోగలగాలి తరువాత కథ నడపడం నా వంతు!"

"వింతగా చూచింది కల్పన.

"ఏమిట్రా నువ్వు చెప్పేది?" తెల్ల బోతూ అడిగాడు రఘురాం.

"ఈ కాలం కుర్రకారున్నారు. చూశావూ? ఏ జముననో. విజయలలితనో ఆరాధిస్తూ అలాంటి అమ్మాయి భార్యగా రావాలని కలలు కంటూంటారు. నిజం గానే అలాంటి పెళ్ళాం వస్తే ఎలా భరిస్తారన్న ప్రశ్న తరువాత దనుకో మన కల్పనకేం తక్కువుంది? కొంచెం శ్రద్ధ తీసుకొంటే చక్కదనాల ప్రోవై మెరిసి పోగలదు.

"వాడు-రవి! పెళ్ళయితే నిజంగానే నలుగురి బిడ్డల తండ్రి అయ్యేవాడు—వెధవ! సినీస్టారుల్ని ఆరాధిస్తూన్న వాడి కళ్ళకు ఏ పిల్లా నచ్చక ముప్పయ్యేళ్ళొచ్చి ముదిరిన బెండకాయలా తయారయ్యాడు. యిప్పటికీ వంక లెన్నడంలోనే ఉన్నాడు గాడిద!

"ఒకప్పుడు నేనూ ఆ గాడిదలాగే ఉన్నాననుకో. నా భార్య జానకి నాకు మేనరికమే ఆ చిప్ప మొహం నా కక్కర లేదని గోల చేశాను, కాని మా వాళ్ళు మేనరికం కాదనుకొంటామా అని నన్నుమించిన మొండి తనంతో ముడే శారు. జానకి పెళ్ళికి ముందు నా కంటికి ఎలానో ఉండేది. యిప్పుడు ఆవిడే నాకు రంభ, నిజంగా మనిషి అట్టే బావుండదు గాని అలంకరణలో ఆలోపం కనిపించ నీయదు, యిప్పుడు ముగ్గురు బిడ్డల తల్లి అయినా ఆవిడ శ్రద్ధకు నాకే ఆశ్చర్యం కలుగుతూంటుంది. పోతే ఆవిడ కంఠ స్వరం మాటా చాలా హాయిగా ఉంటాయి ఆ ముఖంలో నల్లగా చురుగ్గా మెరిసి పోయే ఆ కళ్ళను ఎదుటుండగా చూడ కుండా ఉండలేను. యిదేమిటి భార్యా స్తుతి మొదలు పెట్టాడనుకొంటున్నారా? ఎంత అందవికారుల్లోనైనా ఏదో ఒక రకమైన ఆకర్షణ భగవంతుడు పెట్టాడని చెప్పడానికే.

"అలా-ఒక చూపులో బాగా లేదన్న మనిషే సన్నిహితంగా నిమిషాలు మెలిగితే ఆత్మీయంగా కాస్సేపు మాట్లాడ గలిగితే తప్పకుండా ఏదో ఒక రకమైన ఆకర్షణ మనిషిని బంధించి తీరుతుంది.

"సరే! ఈ మొదటి గండం దాటి

రెండవది-గడ్డు గండం-ఖర్చు పన్నం బాధ. అదెలా తప్పించుకొంటాం? నా పరిస్థితి తెలుసుగా? నేనంతకు మహా ఐయిదువేలు పైఖర్చులు మరో రెండు మూడు వేలు. అంతకు మించినాకు అప్పు ట్టే వాడు లేడు అంతకు మించిపోతే అందులోంచి బయటపడే శక్తి నాకు లేదు.

"ఛ ఛ! నీకా బెంగే క్కర్లేదు. రెండు పూలదండలతో, కాస్త తేనీటి పార్టీతో నీ చెల్లెమ్మను ఒకింటిదాన్ని చేస్తాము."

"యిలాంటి వాటిలో నేస్యాలూ, కోతలూ కూడవురో!"

"ఎంత మాట! నేనేలాగ కోతల రాయుడినని ప్రతిదాంట్లోనూ కోస్తానను కొన్నావా!"

"అయితే. యిది జరిగేపని? అసలు ఆ పిల్ల అదృష్టం బాగుండి అబ్బాయికి నచ్చడమూ, నచ్చకపోవడమ అంటూ ఉండాలిగాని యిలా వేషం వేసి అతగాడిని వల్లో వేసుకోవాలనడం మర్యాదస్తుల లక్షణమా? యింత చేసి, అతనితో పెళ్ళి జరుగకపోతే మరో ప్రయత్నానికి ఈ పరిచయమే కళంకంగా ఏర్పడాల్సి ఎదుట నిలబడదూ? ఏం ప్లాన్ యిది! మువ్వు చెప్పినట్టు పోతే యిహ జన్మలో పెళ్ళి జరిగే గీత ఉండబోదు దానికి!"

"శుభం పలకరా బసవన్న అంటే ఏమిట్రా నీ మాటలు? కొంచెం ఫాషన్‌గా తయారవడమంటే వేషం గట్టడమా? ఆ అబ్బాయితో—నచ్చితే కాబోయే భర్తతో కొంచెం చనువుగా మాట్లాడమంటే అంత కళంకం తెచ్చే సంగతా? ఆడపిల్లకు ఆపాటి స్వేచ్ఛ లేకపోవడంవల్లే మన దేశంలో ఆడకూతురు జన్మ యిలా తగలబడింది. పెళ్ళికి ముందు కాస్సేపు వధూవరు లిద్దరూ సరదాగా మాట్లాడుకోవడం, ఒకరి అభిప్రాయాలు ఒకరు



తెలుసుకోవడం. ఒకరి మనస్తత్వాన్ని ఒకరు అకళింపు చేసుకోవడం-తప్పంటావా? మర్యాదస్తుల లక్షణం కాదంటావా? ఒకసారి అలా చాపమీదికి తీసుకు వచ్చి కూర్చోబెట్టడమే మర్యాదస్తుల లక్షణం కాబోలు! అలా ఒక్కచూపులో నచ్చడం నచ్చకపోవడం ఆ పిల్లఅదృష్టం మీద ఆధారపడాలి కాబోలు!"

"సరేనోయ్! యింతాచేసి, ఆ అబ్బాయితో పెళ్ళి జరుగదు! ఆ అబ్బాయికి యిష్టముండీకూడా పెళ్ళిదాకా పోనివ్వడనుకో అంటే. అతడిది దుష్టస్వభావం అనుకో, అతడిది ఆడపిల్లల్ని మోసగించే తత్వమనుకో, అప్పుడు....అప్పుడు ఎంత ప్రమాదం! అప్పుడు, దారిన బోతున్న పంచని కాలని రాసుకొని ఒంటికి బురద పూసుకోవడం 'కాదూ! అరిటాకు లాంటి ఆడపిల్ల జీవితానికి చెడ్డపేరు వచ్చిపడడం ఎంతసేపు?'

"నిన్ను నీ కుళంకలతోసహా తీసుకెళ్ళి గోతిలో పాతెయ్యా!" విసుక్కొన్నాడు చంద్రశేఖర్.

"ముందు కీడెంచి మేలెంచమన్నారు మన పెద్దలు!"

"సరే నీ మాటే చెప్పుకుందాం.... దురదృష్టవశాత్తూ ఆ సంబంధం తప్పిపోతుందనుకో మగవాళ్ళతో స్నేహానికి తహతహ లాడే ఆడపిల్లని చెడ్డపేరే వస్తుందనుకో. యిహ పెళ్ళే కాదనుకో. ఏం కొంప లంటుకుపోతాయా! ప్రపంచం మారిపోతుందా? ఓపిక ఉన్నంతవరకు ఆ పిల్లను చదివించు, ఆ పిల్లకు తనకాళ్ళ మీద తను నిలబడగలిగే బలమివ్వు. పంతులమ్మ అవుతుంది. నలుగురి పిల్లలకు విద్యాబుద్ధులు చెబుతుంది. తనకూ విజ్ఞానతృష్ణ ఉంటే ఒక్కో అడుగూ ముందుకు వేస్తుంది. గొప్ప శాస్త్రవేత్తగా పేరు తెచ్చుకొంటుంది. లేకుంటే ఏ లాయరుగానో పైకివస్తుంది. యింకాపైకి రావడానికి, పేరు ప్రఖ్యాతు లార్జించుకోడానికిఆడపిల్లకు ఎన్ని లేవు? పెళ్ళిఒక్కటే ఆడపిల్ల జీవితానికి పరమావధిగా చెప్పే వాడి శిగతరిగి అవతల పారేయాలి. పెళ్ళి కంటే మిన్నఅయినదీ, తృప్తికరమైనదీ, జీవితానికి నిండుదన మిచ్చేదీ ఆడపిల్లకి మరొకటి లేదని నూరిపోసి-పెళ్ళికాని ఆడపిల్లను భయపెట్టే వెధవ నాలుక తెగ్గోసి మైలుదూరంలో విసిరేయాలి."

"చెప్పడం తేలికేరా! అంతా మువ్వు చెప్పినట్టే తిరిగితే ఈ సంఘం ఊరుకోవద్దూ!"

"ఈ సంఘం పుట్టుగ్రుడ్డిది. బ్రహ్మచెవుడూ అంధత్వమూ రెండూ కలసిన వాడిమాటలు ఎంత హాస్యా

స్పదంగా ఉంటాయో నేను చెప్పాలా! డోంట్ కేర్. సంఘం మెప్పు దలకోసం కాదు-తన ఆత్మ చెప్పినట్టే నడుచుకొనే వాడే ధన్యజన్ముడౌతాడు చివరికి.

"కాబట్టి, ఒకడుగు ముందుకు వేసే స్వేచ్ఛ ఆ పిల్లకి యిచ్చిచూడ రఘూ! కల్పనకు తన మంచిచెడ్డలు తను నిర్ణ యించుకోగల వయసు కాదంటావా?

"కాదని కాదు," యింకా నసుగుడు కట్టిపెట్టలేదు రఘురాం. "సరే ఆ అబ్బా యికి నచ్చుతుందనుకో. ఆ తరువాత కట్నం...."

"ముందు అతడిముక్కుకు తాడొకటి వేస్తే చాలు. అతడి నడ్డంపెట్టి నేనే కట్న మనే బ్రహ్మరాక్షసిని నరుక్కురావచ్చు!"

"బొత్తిగా అనుభవం లేనిమాటలురా, నీవి! నీ మాటలు నమ్ముకొంటె నీళ్ళులేని బావిలో బండెడు రాళ్ళు కట్టుకొని దూకేసి నట్టే. ఎంత పిల్లను యిష్టపడిన పిల్లా డయినా కట్నంప్రశ్న వచ్చేపటికి పెద్ద వాళ్లను ముందుకుత్రోసి తన వెనక్కి నక్కుతాడు. సర్వసాధారణమైన సంగతి అది. కాకపోతే కథల్లో, సినిమాల్లో నాటి కాల్లో వరకట్నాన్ని యింతగా ఖండించి పారేస్తూన్నా, ఈ వరకట్న దురాచారం యింత నిర్లజ్జగా వీరవిహారం చేస్తూన్న దంటే-కారణమేమి టంటావు?"

"ఓ!...." హీరో పోజు పెడుతూ కాలర్ సవరించుకొని నిటారుగ కూర్చొ న్నాడు చంద్రశేఖర్. 'ఎందుకని చేప కథలా చెప్పుకు రావలసి వస్తుంది నీ ప్రశ్నకు జవాబులు. ఈ పెళ్ళి కావలసిన పిల్లవాడికి పెళ్ళి కావలసిన ఓ చెల్లెలు ఉంటుంది. వీడి కట్నానికీ, ఆ పిల్ల పెళ్ళికీ లంకె పడుతుంది. వీడి కట్నంతో పెళ్ళి కావలసిన పిల్ల ఉండదనుకో! పెళ్ళి పిల్లకు నగా నట్రా, బట్టా బాతా పెట్టాలి కదా, మగపిల్లవాడి పెళ్ళికి వేలు అప్పు చేస్తామా ఏమిటి? ఆ కట్నం ఆ పెళ్ళి ఖర్చుకే పెట్టేస్తాం అంటారు. ఉన్నవాడు కానీ, లేనివాడు కానీ ఆడపిల్ల వాళ్ళను తిరుక్షవరం చేసేదాకా నిద్ర పట్టదు.

"తన అన్నగారు ఓ కొంపను దోచి లికి చేసిన డబ్బుతో తను పెళ్ళి చేసుకో వాలనే ఆడకూతురికి సిగ్గూ, బుద్ధీ ఉండాలి. అలాంటి పెళ్ళి లేకపోతేనేం? అలాంటి పెళ్ళి కంటే అజన్మ బ్రహ్మచారిణిగా ఉంటే జన్మ తరించదూ? లేకపోతే తనకు నచ్చినవాడిని తీసుకుపోయి ఏ గుళ్ళోనో పూలదండలు మార్చుకొంటే సరిపోదూ? అలా చేయడం సబబు విద్రోహమం టారు. కావి, నా ఉద్దేశ్యం ప్రకారం ప్రేమ వివాహాలను ప్రోత్సహించాలి.... తరువాత జీవితంలో వాళ్ళెలా సుఖపడతా రన్న ప్రశ్న రెండవదిగాని మొదట వర కట్న దురాచారం మీద దెబ్బ తీసినట్టవు తుంది. ఈ అంకె అక్కడక్కడా తెగ గొట్టి బలహీన పరిచామంటే క్రమ క్రమంగా ఈ వరకట్న దురాచారం మాసి పోతుంది. ప్రేమ వివాహాలు జరగాలంటే ఆడపిల్ల అవధులు మీరని స్వేచ్ఛ మనం యివ్వాలి. ప్రేమ వివాహాలు ప్రోత్సహిం చాలి. ప్రేమ వివాహాలను చులకనగా చూడడం అంత తెలివైన పని మాత్రం కాదు!"

ఇంతసేపటికి ఓ నిర్జీవమయిన నవ్వు నవ్వాడు రఘురాం. "మనం స్వేచ్ఛ యిచ్చినా కల్పనకు ఆపాటి ధైర్యం ఏదీ? మగవాళ్ళంటేనే బోలెడు సిగ్గు దానికి. అలా బయటికి వెళ్ళిందంటే దాని తల భూమిలో పాతుకు పోతుందేగాని పైకి లేవదు!"


"మనం వెనుక ఉండి ప్రోత్సహిస్తు న్నామని తెలిస్తే ధైర్యం కలుగక ఏం చేస్తుంది? నువ్వు ఊ-అనవోయ్ ముందు- నా ప్లాన్ సక్సెస్ అయినట్టే లెఖ్ఖ!"

"రెండు పూల దండలతో, చిన్న తేనీటి పార్టీతో ఆడపిల్లనో యింటిదాన్ని చేస్తానంటే ఆశ పడని వాడెవడు. గానీ ముందు కల్పన నడుగు!"

"ఏమ్మా! అతడితో మాట్లాడడం నీ కిష్టమేనా?"

బెరుగ్గా చూచిందేగాని నోట నుండి మాట రావడం లేదు కల్పనకు. 'తనకూ విజ్ఞాన తృష్ణ ఉంటే ఒక్కో అడుగు ముందుకు వేస్తుంది. గొప్ప శాస్త్రవేత్తగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకొంటుంది.' విజ్ఞానాకాశంలో మిలమిల మెరిసిపోయే నక్షత్రమైనట్టు ఒక్క క్షణం కలలోకి జారిపోయింది కల్పన. ఎమ్. ఎస్‌సి. అయి, లెక్చరర్ జాబ్‌లో పడి రీసెర్చి చేయాలని తనకెంత కోరిక? ఆ కోరిక ముందు ఈ పెళ్ళి పిల్లలూ, సంసారం— అన్నీ తృణప్రాయంగా, చిరుగాలికి ఎగిరి పోయే బూడిద కణంలా తోస్తాయి. ఏకా గ్రత, గాఢమైన దీక్ష ఉంటే సాధించని దేముందిగాని ఈ పాడు ప్రపంచం 'పెళ్ళి పెళ్ళి' అంటూ వీపు తట్టుతుంది! స్థిర సంకల్పం నుండి బలహీన పరుస్తుంది. ఆర్చే తీర్చే బుద్ధి లేకపోయినా అన్నిట్లో తల దూర్చడం మాత్రం తెలుస్తుంది గ్రుడ్డి లోకానికి!

విజ్ఞాన తృష్ణ ముందు ఈ పెళ్ళి అన్న పదం నిస్సారంగా తోస్తూ ఉంటే-అతగా డెవరో తనది జిడ్డు మొహం అన్నాడని విని అవమానంతో, ప్రతీకార భావంతో హృదయం బుస కొడుతూంది. అతడి నెత్తాగైనా లొంగదీసి అప్పుడు చెప్పాలి బుద్ధి. అహం ఆవేశం రేగింది. ఉప్పూ కారం తింటూన్న మనిషాయె! విజ్ఞాన తృష్ణ కొంచెం అడుగు ముట్టబోతుంటే- 'పెళ్ళి, పెనిమిటి' అంటూ తీయగా చెవి దగ్గర ఊదుతున్నాయి వయోసహజమైన ఊహలు....ఇంత సంఘర్షణ మనసులో జరుగుతూంటే పైకి ఏ ఆలోచనలూ తెలి యని అమాయకురాలిలా మూగ గొడ్డులా నిలబడింది కల్పన.



"చూచావా? పాత వాడివి -నీతో మాట్లాడడానికే అదింత సిగ్గుపడుతుంటే ఊహ ఆతగాడితో మాట్లాడగలుగుతుందా?

నీవన్నీ కానీ పోనీ ఊహలు!" నిరుత్సాహపరిచాడు రఘురాం.

"ఇహ యిప్పుడు నా పరువు కాపాడవలసిన బాధ్యత నీ మీదే ఉంది, కల్పనా! నిన్నేమీ కాని పని చెయ్యమని చెప్పడం లేదు. అతనితో-కాబోయే భర్తతో కొంచెం సన్నిహితంగా మెలగడం పెద్ద తప్పు అయిన సంగతి కాదు. ఇంగ్లీషు వాళ్ళ సంగతి నీకు తెలియదూ? వధూవరులిద్దరూ పెళ్ళికి ముందే...."

మరి చెప్పనివ్వలేదు రఘురాం. "అలాంటి అనుకరణల వల్లే, నకళ్ళ వాతల వల్లే మన దేశం యిలా తగలబడింది! ఇహ చాల్లే ఉదాహరణలు!"

"ఉత్త చాదస్తపు గొడ్డువి. ఉత్త...." మదురు కొట్టుకొన్నాడు చంద్రశేఖర్. "అమ్మా, కల్పనా, మీ అన్నయ్య మెడ గొంతుదాకా అప్పుల్లో ముంచి నువ్వొక ఇంటి యిల్లాలివై, ఇంటి దీపానివై సుఖించు తల్లీ! వస్తాను...." విసురుగా లేచాడు.

"శేఖరన్నయ్యా!" బాధగా పిలిచింది కల్పన. "మీరు చెప్పినట్టు వింటాను, అన్నయ్యా! నన్నో యింటిదాన్ని చేయా

ఉంటే ఉన్న ఒక్క ఆధారం ఈ యిల్లు తాకట్టు పెట్టో, తెగనమ్మో చేయాలి. వాడిని నీడ నుండి తరిమేసి నేనో నీడ చేరి సుఖపడలేను. అలాంటి పెళ్ళి నేను చేసుకోను - చావడానికైనా సిద్ధపడతాను గాని!'' కొంచెం ఆవేశంగా అంది.

''గుడ్! కల్పన నీ చెల్లెలు కాదు-నా చెల్లెలు!'' భుజాలు సగర్వంగా ఎగరేశాడు చంద్రశేఖర్.

క్రొత్త వ్యక్తిని చూస్తున్నట్టుగా చూస్తున్నాడు రఘురాం. 'అమాయకంగా కనిపించే ఈ పిల్ల యింత ఆలోచించే దయిందా?'

నిజంగా అమాయకంగా ఉంటుంది కల్పన. కాని, అమాయకురాలు కాదు. అన్ని విషయాలూ తెలుసు. సినీయాక్టర్ల దగ్గరనుండీ క్రికెట్ ఆటగాళ్ళ దాకా మాట్లాడ గలదు. ఉల్లిపాయ గుజాల నుండి ఇందిరమ్మ గుజాల దాకా విమర్శించ గలదు. అయితే ఆ పిల్ల పెదవి విప్పడానికి మనసు కలసిన వాళ్ళుండాలి! అదీ, అసలు సంగతి.

'చూద్దాం! ఆయనతో నేను మాట్లాడలేనా!' అన్న ధీమా తెచ్చుకొంటూంది, పైకి అమాయకపు ముసుగు వేసుకొన్న కల్పన.

* * *

కల్పన చేతిలో కత్తెర చెక్-చెక్ మంటూంది. కత్తెర చెవుల దగ్గరికి పోతూంటే మనసులో ఏదో వికారం బయల్దేరింది. కాని, సాహసించింది.... ఫలితంగా గుప్పెడు నిడుపాటి వెంట్రుకలు చేతిలో మిగిలాయి. చెవుల దగ్గరా-పాపటి దగ్గిరా కత్తిరించిన వెంట్రుకలు మొండిగా కనిపిస్తూంటే అప్రయత్నంగా కళ్ళలో నీళ్ళు చిందాయి. 'ఎందుకొచ్చిన అవస్థ యిది, భగవాన్?' అనుకొంది చికాకుగా. తలంతా వంకీలుగా ఉండదు? నీ నుదుటి మీద చిన్న చిన్న రింగులు ఒరిగినాయి కల్పనకు. విన్న మొన్న సన్నగా దువ్వే సేది కాబట్టి వాటి అందం తెలిసేది కాదు గాని ముందు వెంట్రుకలు అక్కడక్కడా సన్నగా కత్తిరించి చమురూ, తడి పెట్టి త్రిప్పేసరికి చక్కగా వంకీలు-వంకీలు తిరిగి ఎక్కడో కవిగారు వర్ణించినట్టు ఓ ప్రక్కనుండి మేఘ మాలికలు ముసిరిన చంద్రబింబంలా కనిపించసాగింది కల్పన వదనం. పలుచగా స్నో, పౌడరు పట్టించేసి, సన్నగా, నాజూకుగా కనుబొమల మధ్య ఎర్రని తిలకం పెట్టి, కంటి నిండుగా కంటి కొసల దాకా కాటుక దిద్ది చూచుకొనేటప్పటికి 'నిజంగా, నేనింత బాగుంటానా?' అని ప్రశ్నించుకోవలసి వచ్చింది కల్పనకు. మెడ చుట్టూ పౌడరద్ది, హెయిర్ పిన్నుతో ఒకే పచ్చ గులాబీ పువ్వు సైడ్‌గా పెట్టింది. లేత గులాబీ రంగులో వుల్‌వాయిల్ చీరా, అదే జాకెట్ వేసుకొని ఒక్కసారి నిలువెల్లా పరీక్షగా చూచుకొంది. 'ఓ!' అనుకొంది ఆశ్చర్యంగా. కుచ్చిళ్ళు పొందికగా అమర్చుకోవడంలో, పొట్టి రెట్టల జాకెట్ వేసుకోవడంలో అందం లేదని ఎవరంటారు? ఓ గంట సేపు ఎదురింటి కళావతి దగ్గర ట్రెయినింగ్ అయి వచ్చింది కల్పన, అలంకరణలో. ఆ అమ్మాయి కల్పన క్లాస్‌మేటు! చాలా ఫాషన్‌బుల్‌గా ఉంటుంది. రోడ్డు మీద వెడుతూంటే ఆమెకోసం పడి చచ్చే మగపిల్లలకు కొరత వుండదు. కళ తన కంటే బాగుంటుందనుకొనే కల్పన ఈ క్షణంలో అలా అనుకోవడం లేదు.

గోళ్ళకు కలర్ వేస్తూ అద్దం ముందు స్టూల్ వేసుకొని కూర్చొంది కల్పన.

అవతల కొన్ని జతల జోళ్ళ శబ్దం వినిపించి గుండె గతుక్కుమంది. ఎదలో ఏమిటో దిగులు బయల్దేరింది. 'ఇంట్లో తోడుగా వదిన ఉంటే బాగుండేది.... పాపాయి! నెల రోజుల లోపలే వచ్చేయమని వ్రాయాలి' అనుకొంది. పరిచితమయిన రెండు గొంతులు కాక మరో క్రొత్త స్వరం కూడా వినవస్తూంది.... 'ఓ! అతడు....అతడొచ్చినట్టుంది!' చిరు చెమటలు పోశాయి.

''కల్పనా. మూడు టీ!''

క్రొత్త గొంతు వారిస్తూంది. ''ఇప్పుడెందుకండీ? హోటల్లో తీసుకొనే వచ్చాం.'' బాగుందతని గొంతు.

''ఫర్వాలేదు.''

ట్రేలో మూడు కప్పులుంచి తీసుకుపోయింది కల్పన. రఘురాం లేచి అందుకొని యిద్దరికీ యిచ్చి, తనొకటి తీసుకొన్నాడు. క్రొత్త వ్యక్తిని ఓరగా గమనించిన కల్పన, 'తెల్లగా బావున్నాడు కదూ? అందుకే అంత టెక్కు!' అనుకొంది. అతడే రవీంద్ర అని ఆమెకు నమ్మకం కుదిరి పోయింది. చెంపలు నిండుగా లేవుగాని వంకీల జుట్టుతో, చివర ఒంపు తిరిగిన పొడవైన నాసికతో, సన్నని మీస కట్టుతో, ఖరీదైన టెరిలీన్ సూట్‌లో చక్కని హుందాతనం వ్యక్త పరుస్తూ, చూపరులకు యిట్టే అభిమానం అంకురింప జేసేలా ఉన్నాడు. కాని, అతడిటు తల త్రిప్పి చూడడం లేదు.... సభ్యత కాబోలు!

చంద్రశేఖర్ పేక కలుపుతున్నాడు. ''మనం ముగ్గురం. మరొక చెయ్యి ఐతే బాగుండేది!''

''మన కల్పన ఉంది కదా! రావే, చెల్లాయ్! పనేం లేదు కదా? రెండు ఆటలు వేద్దాం....'' ఉత్సాహంగా అన్నాడు రఘురాం.

కాళీ ట్రే తీసుకొని వెనుదిరుగుతూన్న కల్పన గతుక్కుమంది. అతడు తనవైపు చూడడంలేదని గమనించి తల అడ్డంగా ఆడించింది.

''పరవాలేదమ్మా! ఇతడు మనవాడే! రవీంద్ర అని నా చిన్నప్పటి ఫ్రెండు....

రా. రా!'' చంద్రశేఖర్ బలవంతం పెట్టాడు.

ట్రే స్టూల్ మీద వుంచి కర్చీ జరుపు కొని కూర్చొంది కల్పన.

అతడు-రవీంద్ర చాలా ఇబ్బందిగా ఫీలవుతున్నట్టు గమనిస్తూన్న కల్పన— 'ఆడపిల్లకు అష్టవంకలు పెట్టే కంతుడూ జయంతుడూ కదూ? అబ్బా! ఎంత సిగ్గూ? ఎంత బిడియం!' కపిగా నవ్వుకొంది.... 'ఓయ్! అమాయకుడా! నీకు నే పడుతున్నారు తెలుసా?'

* * *

''రఘురాంగారూ! రఘురాంగారూ!''

''...............''

''ఉహుం....నాకు భయమేముంది. అన్నయ్యా! మవ్వెళ్ళు బాబూ!''

''చంద్రశేఖర్‌కు మాటెందుకిచ్చావు. మరి! ఏమిటో నాకూ అతడి అంతు చూడాలనే ఉబలాటం బయలుదేరింది. విపరీత ఉచ్చేదో అతడి మెదకు పడినట్టే ఉంది. లేకపోతే, యివాళ యింత దూరం ఎందుకు వస్తారు చెప్పు! వెళ్ళు. మరేం ఫరవా లేదు. నేను యింట్లోనే వుంటాగా? అతడితో క్లోజ్‌గా ఉండు. చంద్రశేఖర్ మాటలు గుర్తు పెట్టుకో!''

''రఘురాంగారూ! ఓ....''

మరొకసారి అన్నగారికేసి నిస్సహాయంగా చూచి ఇవతలికి వచ్చింది కల్పన. ''అన్నయ్యా పోస్టాఫీసుదాకా వెళ్తున్నానని వెళ్లాడండీ!''

''అలాగా? చంద్రశేఖర్ ఎక్కడికి వస్తానన్నాడట. వచ్చారా. అంటే ''

''ఉహుం....''

అతడు వెళ్ళబోతుంటే—

''వచ్చి లోపల కూర్చోండి. అన్నయ్య యిప్పుడే వచ్చేస్తాడు'' అంది కల్పన.

రవీంద్ర ఒక్క క్షణం ఆలోచించినట్టు నటించి నెమ్మదిగా లోపలికి వచ్చి కుర్చీలో కూర్చొన్నాడు. టేబిల్ మీదున్న మాగజైన్ ఒకటి తీసి అతడికి కాలక్షేపానికి అందించింది కల్పన. అక్కడ వుండడం యిబ్బందిగా తోచి లోపలికి వచ్చింది. అన్నగారు ఓ మొట్టికాయ వేసి, గుర్తురిమేసరికి యివతలికి రాక తప్ప లేదు.

కల్పన గుమ్మంలోకి వెళ్ళి వీధి పొడవునా దృష్టి సారించి చూచి వచ్చి —''అన్నయ్య రాలే దెందుకో? ఎవరైనా ఫ్రెండ్స్ కలిశారో ఏమో? మీకు తోచనట్టుంది. అన్నయ్యొచ్చే దాకా కార్డ్స్ ఆడదామా రవీంద్రగారూ' అంది కల్పన.



''ఓ! మీరు చాలా బాగా ఆడతారు.మీతో ఆడి గెలవగలనా?'' అతడు తమాషాగా నవ్వాడు.

''అం ఏంలేదు. వేళాకోళానికి. అంత గొప్ప ఆటకత్తెనేం కాదులెండి!'' డ్రాయర్ సొరుగులోంచి పేక తీసింది కల్పన.

విన్న ఒకటి రెండు ఆటలదాకా చాలా ఇబ్బందిగా ఫీలయ్యాడు రవీంద్ర. పూర్తిగా ఆట మూడ్‌లోకి వచ్చేశాక తమతో ఓ ఆడపిల్ల ఆడుతుందన్న విషయమే మరిచిపోయాడు. ఆమెకేసి నిస్సంకోచంగా చూడగలగడం, మాటకలపడం కల్పన పరిచయం-అన్నీ నిన్ననే జరిగిపోయాయి.

ఈ వేళ అతడి ప్రవర్తనా క్లోజ్‌గానే ఉంది.

రెండు ఆటలు అయిపోయాయి.

మూడో ఆటకు రవీంద్ర పేక కలుపుతున్నాడు.

స్టయిల్‌గా జడ ముందుకు వేసుకొని చివరలు మెలిపెడుతూంది కల్పన.

అతడు కుతూహలంగా ముందుకు వంగి చిరునవ్వుతో ప్రశ్నించాడు: అదంతా మీ జుట్టేనా అండీ? ఏడుకొండల వెంకట్రమణుడి జుట్టుకూడా కలిసిందా?''

''ఛ! నా జుట్టే.''

''పెద్ద తలకట్టు ఆడపిల్లకు ఎన్నివంకలున్నా కప్పిపెడుతుంది. మీ జుట్టుకు నా దిష్టి తగులుతుందేమో గానీండి-కోడె త్రాచులా నిగనిగ లాడుతూ—బారెడు— నేత్రానందంగా ఉంది. ఈ కాలంలో ఆడపిల్లలకు ఇంత తలకట్టు ఎక్కడుంటుందండీ! నారతీసిన టెంకాయ జుట్టంత మొండిజడలు; లేకపోతే,తలంతా పాయలు పాయలుగా బట్టతల కనబడుతూంటే ఉన్న నాలుగువెంట్రుకలకూ గుదిబండల్లా మోట మోకంత సవరం బిగిస్తారు!''

కిలకిల నవ్వింది కల్పన.

''మీ నవ్వు చాలా హాయిగా ఉంటుందండీ. నవ్వితే మీ పలువరస చాలా అందంగా కనబడుతూంది. మీరు నవ్వుతూంటే మీ ముఖంలోకి మళ్ళీమళ్లీ చూడాలనిపిస్తుంది.''

''ఊం?'' క్రీగంట వీక్షిస్తూ మెత్తగా నవ్వింది తిరిగి కల్పన.

దొడ్డి వాకిట్లోంచి వచ్చి తల వాకిట తేలాడు రఘురాం.

''ఓ! రవీంద్రా!ఎప్పుడొచ్చారు! చాలా సేపైందా?''

''అబ్బే! కాస్సేపైంది వచ్చి,'' తడబాటుతో అన్నాడు రవీంద్ర.

చిరునవ్వు నవ్వుకొంటూ కుర్చీజరుపుకొని కూర్చొన్నాడు రఘురాం.

మర్నాడు సాయంకాలం-

''ఏమండీ, మీ కేదో సంబంధం వచ్చిందని విన్నాను, నిజమేనా?

''ఎవరు చెప్పారు?''

''చంద్రశేఖరంగారు.''

''ఓ! అతడా! ఆ సంబంధం తీసుకు వచ్చింది ఆ మహానుభావుడే లే.''

''ఏమైంది మరి?''

''అవడానికి ఏముంది? ఆ అమ్మాయి ఫొటో తీసుకువచ్చి చూపాడు. ఫొటోలోనే ఆ సుందరాంగి అంత అందంగా ఉంటే అసలెంత అందంగా ఉంటుందోనని భయమేసి త్రోసివేశాను!''

''ఊఁహూఁ!'' పెదవి పంటిక్రింద వేసి కంటిలో ఎర్రజీర అలుముకోగా రవీంద్రకేసి ఓరగాచూసింది కల్పన.

''ఓ వేళ మీకు నచ్చినపిల్లే దొరికితే కట్నం ఏపాటి తీసుకొంటారో?''

''అబ్బే! ఆ విషయాలన్నీ నేను ఆలోచించను. అదంతా మా పెద్దవాళ్ళు చూచుకొంటారు. నాకు కావలసింది అందచందాలు.''

''మీ కంటికి నచ్చినపిల్లే దొరుకుతుందనుకోండి. మీ అంగీకారం తెలిపేసి పెళ్ళికి ఎదురుచూస్తూ కూర్చొంటారు. మీ వాళ్ళు ఆ పిల్ల తల్లిదండ్రుల రక్తం పిండి పదివేలో ఎనిమిదివేలో కట్నం వసూలుచేయడానికి సిద్ధపడితే?''

''అబ్బే! ఆ విషయాలు నేను పట్టించుకోను. అవన్నీ పెద్దవాళ్ళ విషయాలు. నా జోక్యం ఏం బాగుంటుంది? అయినా రక్తం పిండడమని ఎందుకుఅనుకోవాలి! వాళ్ళకి ఇవ్వగల తాహతు ఉంటేనే మా దాకా వస్తారు!''

''ఓ! మీ అర్హత విలువ ఓ ఎనిమిది పదివేలదాకా పలుకుతుందన్న మాట?''

''అది వరకట్నం. అది మన ఇళ్ళలో సర్వ సాధారణమైన రివాజు. కాని ఈ కాలం ఆడపిల్లలు విపరీతార్థాలు తీసి ఏమిటేమిటో మాట్లాడేస్తుంటారు!''

''ఆ రివాజు మీ ఇంట్లో ఉందేమోగాని మా యింట్లో ఏంలేదు లెండి. మా అన్నయ్య వరకట్నం ఏం తీసుకోలేదు. పోతే, వరకట్నం నాకూ యిచ్చిచేయడు. యిచ్చినా అలాంటి సంబంధం నేనూ చేసుకోను.''

''ఓ!'' చిత్రంగా చూచాడు రవీంద్ర.

''నిజంగా నే నలాంటి సంబంధానికి ఒప్పుకోను. కట్నం తీసుకోని ఆదర్శవంతుణ్నే పెళ్ళాడతాను. పిల్లే పదివేల కట్నంగా భావించి చేసుకోగలవాణ్నే పెళ్లాడతాను!''

''ఓ! మీరు పదివేలు విలువ చేస్తారన్న మాట?''

''నేను నచ్చినవాడికి పదివేలేం ఖర్మ? లక్ష చేస్తాను! కోటి చేస్తాను!'' దర్పంగా నవ్వేస్తూ జడ ముందుకు తీసుకొని చివరలు అల్లసాగింది కల్పన.

చటుక్కున ముందుకు వంగి ఆమె జడ అందుకొని మెత్తగా నలిపిచూస్తూ ''మీ జుట్టే పదివేలు ఖరీదు చేస్తుందండీ'' అన్నారు తమాషాగా నవ్వేసి రవీంద్ర.

''ఛీ! వదలండి.'' కోపంతెచ్చుకొంది కల్పన.

''ఓ! సారీ!''

''మీ కేదో నాగురించి చవకబారు అభిప్రాయం ఏర్పడినట్టుంది. మగవాళ్ళతో కొంచెం క్లోజ్‌గా ఉండేమాట వాస్తవమే గాని కారెక్టర్ని అంత తేలికగా చెడగొట్టుకొనే తెలివి తక్కువదాన్ని మాత్రం కాదు. దురదృష్టవశాత్తూ మీకు నాగురించి అలాంటి తేలికరకం అభిప్రాయమే కలిగితే యికనుంచీ మీరు మా యింటికి రానక్కరలేదు. మీకోసం వస్తున్నానా? మీ అన్నయ్యకోసం వస్తున్నాను. అంటారేమో, మీలాంటి వ్యక్తి మా అన్నయ్యకు స్నేహితుడుగా ఉండతగడు! కాబట్టి యిక మీరు మా యింటికి....''

''అమ్మా! చండికా! కొంచెంఆపు!'' అసహనంగా కల్పన నోరు మూశాడు రవీంద్ర. ''మీతో పరిచయం కలిగికొద్ది రోజులే అయినా మిమ్మల్ని బాగా అర్థం చేసుకొన్నాను, కల్పనా! నువ్వు చాలా తెలివైనదానివి. చురుకైనదానివి. నువ్వు ఏ విషయాన్నయినా తెలివిగా మాట్లాడగలవు. నువ్వు మాట్లాడుతుంటే విన్నకొద్దీ వినాలనిపిస్తుంది. నిన్ను చూసినప్పుడల్లా ఏదో క్రొత్తఅందం గోచరిస్తుంది. నిజంగా నిజంగా నువ్వు వేలూ, లక్షలూ కాదు, కోటి చేస్తావు!'' బహువచనం ఏకవచనంలోకి ఎప్పుడు జారిపోయిందో అతడు గమనించేలోపలే, ''రవి యిక్కడే ఉన్నాడే! ఎప్పు డొచ్చావురా?'' అంటూ రఘురాంతో ప్రవేశించాడు చంద్రశేఖర్.

''అమ్మాయ్. కల్పనా! మూడు మంచి టీ....''

కల్పన లోనికి వెళ్ళిపోయింది.

డ్రాయరు సొరగులోంచి పేకతీశాడు చంద్రశేఖర్, ''ఆదివారమేనా వాళ్ళు వచ్చేది?''

''ఆదివారమే. నచ్చితే ఈ పది పదిహేను రోజులలోనే ముహూర్తం పెట్టుకోవాలని తొందరపడుతున్నారు వాళ్ళు. ఆ అబ్బాయికి దూరప్రాంతంలో హోటల్ తిండితో విసిగెత్తిపోయిందట, పెళ్ళవుతూనే ఏకంగా తనతో తీసుకుపోతాడట! మన కి సమయమే కదా? ఆడపిల్లనో అయ్యచేతిలో పెట్టితే దిగినంత బరువు మరెందులోనూ దిగదు. ఈ సంబంధం పడితే కల్పన అదృష్టవంతురాలే అనుకోవాలి;'' అన్నాడు రఘురాం;

రవీంద్ర వదనం వివర్ణం కావడం కళాకాంతులన్నీ అంతరించిపోవడం కనిపెడుతూ చిన్నగా నవ్వుకొన్నాడు చంద్రశేఖర్.

''కల్పనకేనా సంబంధం?'' క్షీణ స్వరాన ప్రశ్నించాడు రవీంద్ర.

''కల్పనకే''

చంద్రశేఖర్ రఘురాం భుజం తట్టి అన్నాడు "నువ్వు అదృష్టవంతుడివోయ్! కానీ కట్నం లేకుండా బావమరిదిని సంపాదిస్తున్నావు!"

"లక్షలు మూలుగుతున్నాయ్ వాళ్ళకు. మనమిచ్చే కట్నం ఏ మూలకు? వాళ్ళకు కావలసింది పిల్ల సంప్రదాయం, అందచందాలు. పెళ్ళి పత్రికలు కూడా వేయ వద్దన్నారు. వాళ్ళదంతా ఆధునికం.... పూలదండలు మార్చుకొని ఏ హోటల్లోనో పార్టీ యిచ్చేద్దామన్నారు."

"అబ్బాయి తలిదండ్రులు మొన్న కల్పనను చూచి నచ్చిందన్నారంటివి కదా! అబ్బాయికి కూడా నచ్చవచ్చు!"

"ఆ... లాంఛనప్రాయంగా అబ్బాయి చూడడమే గాని ఈ సంబంధం ఖాయమైపోయినట్టే అనుకోండన్నారు."

కత్తి వేసినా నెత్తురుచుక్క లేకుండా తెల్లబడి పోయింది రవీంద్ర వదనం. చేతిలోని ముక్కలు ఆట మధ్యలోనే టేబిల్ మీద పడేశాడు.

"ఏరా!"

"పెద్దమనిషివిలే! ఎవతో మొద్దుమొహం దాన్ని తీసుకువచ్చి చేసుకొమ్మని చెప్పావు గాని కల్పనను చేసుకొమ్మంటే నేను చేసుకోక పోదునా? లేక, కల్పనకు నేను తగననుకొన్నావా?"

"కల్పన అంత నచ్చిందేమిటి.... నీకు"

పాంటు జేబులో చేతులు దూరికించుకొని లేచి నిల్చున్నాడు రవీంద్ర. విషాద స్వరంతో అన్నాడు: "ఇహ యిప్పుడెందుకులే నాకు నచ్చడం సంగతి! సమయం మించిపోయింది. కల్పన నాకు నచ్చడమే కాదు, వివాహం కూడా చేసుకోవాలని నిశ్చయించుకొన్నాను. మీ చెవిలో వేసి అంగీకారం తీసుకుందామనేంతలో...." అతడి కళ్ళలో నీళ్ళు చిందాయి. స్వరం రుద్ధమయింది "ఓ! నేను చాలా దురదృష్టవంతుడిని వస్తాను."

టీ తీసుకు వచ్చిన కల్పన తెల్లబోయింది. "టీ తీసుకోకుండానే వెళ్ళి పోతున్నారా?"

ఆగి, ఒక్క-క్షణం గాఢంగా-ఆర్ద్రంగా చూచి విషాద సన్నివేశంలో హీరోలా బరువుగా ఊపిరి వదిలి, కదిలాడు రవీంద్ర.

రవీంద్ర భుజం మీద సున్నితంగా చెయ్యి వేశాడు చంద్రశేఖర్. "టీ తీసుకొని నెడుదువుగాని రా!" బలవంతాన తీసుకుపోయి కుర్చీలో కూలేశాడు.

"ఓ! ఈ విషయం నాకు ముందే తెలిస్తే బాగుండేది. ఇప్పుడొచ్చిన సంబంధం చదువుకొన్న నాకూ, కలిగిన సంబంధమని యివ్వడమేగాని దూర ప్రదేశంలో చెల్లాయ్ ఏం కష్టపడి పోతుందోనని బెంగగా వుంది నాకు. ఒకింటికి యిచ్చేశాక మన కళ్ళ ఎదుట ఉంచుకోవడం అసాధ్యమేగాని, దగ్గరలో ఉంటే బుద్ధి పుట్టినప్పుడు వెళ్ళి చూచి రావడానికి వీలుంటుందని ధైర్యం కదా?" అన్నాడు రఘురాం.

"అయితే ఒక పని చెయ్యి. కల్పనకు రవిని చేసుకోవడం యిష్టమేనేమో కనుక్కో?" చంద్రశేఖర్ అన్నాడు.

"కనుక్కొంటే?...." కనుబొమలు చిట్లించాడు రఘురాం,

"యిక్కడే ముడి పెట్టే యొచ్చు. చెల్లెలు దూరదేశం వెళ్ళిపోతుందన్న బెంగకూడా ఉండదు. వాళ్ళకు ఏదైనా సాకు చెప్పేయవచ్చు. 'పొరపాటు జరిగి పోయింది. అమ్మాయి, అబ్బాయి ప్రేమించుకొని పూలదండలు కూడా మార్చేసుకున్నారు. క్షమించండి అని.'"

"ఏమోయ్, రవీంద్రా?" అన్నట్టు అతడికేసి చూశాడు రఘురాం.

శిశిర వెళ్ళిపోయి హేమంత ప్రవేశంతో చిగిర్చిన చెట్టులా వికశించింది రవీంద్ర వదనం.

"విన్నావు కదా, కల్పనా, రవీంద్ర గురించి నీకు తెలుసుకదా?"

"ఎక్కడో ముక్కూ మొగం తెలియనివాణ్ని కట్టుకొనే బదులు—"వంత పాడాడు చంద్రశేఖర్,

"ఆమెను పువ్వుల్లోపెట్టి పూజించుకొంటానండీ!" మనసులో అనుకొన్నాడు రవీంద్ర.

సిగ్గుతో ఎర్రబడిన ముఖాన్ని దోసిట్లో దాచేసుకొని లోపలికి తుర్రుమంది కల్పన. ఆశ్చర్యంగా, ఆనందంగా చూశాడు రవీంద్ర.

"అయితే రవీంద్రగారు కట్నంమీద ఉన్నారో?"

"కట్నం పేరెత్తితే మీ చెల్లెలు నన్ను పెళ్ళిచేసుకోదండీ దయచేసి ఆ ప్రసక్తి తీసుకురావద్దు."

"గుడ్! రెండు పూలహారాలు పట్టారా, రఘూ! వధూవరులిద్దరూ పూలదండలు మార్చేసుకోనీ! రేపు రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్ళి ఆ కార్యమేదో చూడడం తరువాత సంగతి!"

"బాగుంది వాళ్ళ తలిదండ్రులకు తెలీకుండా అనుమతి తీసుకోకుండానే?"

"శేఖర్ చెప్పినట్టే జరగనీయండి! కట్న కానుకల ఆశలో ఉన్న మా వాళ్ళు ఈ పెళ్ళి యిలా జరుగనీయక పోవచ్చు. మేం దంపతులమై వారి ఆశీర్వాదం కోసం వెళ్ళేదాకా ఈ విషయం తెలియనీయక పోవడమే శుభం!"

* * *

కల్పనా రవీంద్రలు దంపతులై రిజిస్ట్రాఫీసు నుండి యివతలికి వచ్చారు. స్నేహితులకూ పరిచయస్తులకూ పెళ్ళి పార్టీ యివ్వడం ముగిసింది.

తలిదండ్రుల ఆశీర్వాదం కోసం బయలేరబోతున్న సమయంలో "ఒక్క-క్షణం ఆగరా రవీ! కల్పనా, నువ్వు పెళ్ళి చూపుల కోసం తీయించుకొన్న ఫోటో ఎక్కడుందో కాస్త యిలా పట్రా అమ్మా" అన్నాడు చంద్రశేఖర్.

చంద్రశేఖర్ చేతుల నుండి ఫోటో అందుకొని చూచి తెల్లబోయాడు రవీంద్ర ఫోటోలనూ కల్పననూ మార్చి మార్చి చూచాడు. ఆశ్చర్యం నుండి తేరుకొని హాయిగా నవ్వేస్తూ అన్నాడు: "మైగాడ్! ఎంత నాటకం!"